
సాక్షి బాపట్ల

మంగళవారం । 14 । జనవరి । 2025



డ్రోన్‌తో నిఘా

నరసరావుపేటటౌన్: అనుమానిత, నిర్మానుష్య మైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట టూ టౌన్ సీఐ హైమారావు సోమవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 564.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గోదా రంగనాథస్వామిల కల్యాణం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రహదారి లో ఉన్న రాజ్యలక్ష్మి, గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామిల కల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా అమరేశ్వరునికి ఆరుద్రోత్సవం



అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వరునికి సోమవారం వేకువజామున మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నంగా వండి స్వామికి అభిషేకించారు. ఈఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ధనుర్మాసంలో అమరేశ్వరుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకాన్ని నిర్వహించినట్లు వివరించారు. తొలుత అర్చకులు, వేద పండితులు వెంకటాద్రినాయుని మండపంలో మహాన్యాసం నిర్వహించి అనంతరం 11 అమృతాలతో ఏకదశ రుద్రాభిషేకం, వండిన నాలుగు క్వింటాళ్ల అన్నంతో అభిషేకం చేశారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం అభిషేకించిన అన్నాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

కన్నుల పండువగా శ్రీ గోదారంగనాథ కల్యాణం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోదా రంగనాథుల అనుగ్రహాన్ని పొందారు. ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిపారు. కార్యక్రమ నిర్వాహకులు తుల సీరామ్ దంపతులకు, నాగార్జునబాబు దంపతులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేసినట్లు జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఎడ్ల బల ప్రదర్శన



పర్చూరు (చినగంజాం): తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో సోమవారం ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈ నెల 17వతేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. ప్రస్తుతం సోమవారం పెద్ద సైజు విభాగంలో పోటీలు ప్రారంభం కాగా కడపటి సమాచారం అందే సమయానికి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ఎడ్ల జత 22 క్వింటాళ్ల బండను 25 నిమిషాలలో 4226 అడుగులు దూరం లాగి మొదటి స్థానంలో కొనసాగుతోంది. నేడు జూనియర్స్ విభాగంలో, 15వ తేదీ సబ్ జూనియర్స్ విభాగంలో, 16వ తేదీ సేద్యపు విభాగంలో, 17వ తేదీ పాలపళ్ల విభాగంతోపాటు ఆవుల అందాల పోటీలు కూడా జరుగుతాయన్నారు.

మల్లాయపాలెంలో కోడి పందేల జోరు

బల్లికురవ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని బల్లికురవ మండలం పాత మల్లాయపాలెం గ్రామ సమీపంలో సోమవారం కోడి పందేలు జోరుగా నిర్వహించారు. పాతమల్లాయపాలెం నుంచి సోమవరప్పాడు వెళ్లే రోడ్డులో కొండబోడు వద్ద పందెం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పందేల జూదరులు భారీగా తరలి రావడంతో పాటు లక్షల్లో పందేలు సాగాయి. కూటమి నేతల ప్రోత్సాహంతోనే పందేలు జోరందుకుంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. కోడిపందేలతోపాటు కోతముక్కాట, చిత్తుబొమ్మ, పందెలు కూడా జోరుగా సాగుతున్నట్లు గ్రామస్తులు వివరించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ప్రజలు ఆరోపించారు. సోమవారం ఒక్కరోజే పైపందేలు సుమారు రూ.30 లక్షలకు పైగా చేతులు మారినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో పోలీసుల రాకతో నిర్వాహకులు, జూదరులు పలాయనం చిత్తగించారు.



కారంచేడులో మాస్కో బజారులో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు



చీరాల సంతబజారులో భోగి మంటల వద్ద హరిదాసుల నృత్యాలు



బల్లికురవ మండలం కొత్త మల్లాయపాలెంలో భోగి మంటల్లో పాల్గొన్న మహిళలు

భోగి భాగ్యాలు

వాడవాడలా భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే స్నానాలు చేసి వాడల్లో భోగి మంటలు వేశారు. చీరాల సంతబజారులో భోగి మంటల వద్ద హరిదాసులు నృత్యాలు చేశారు. మహిళలు, చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. ఇంటింటా భోగ భాగ్యాలు కలిగాలని ప్రార్థించారు. బాపట్ల, రేపల్లె, వేమూరు తదితర ప్రాంతాల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.

-సాక్షి, నెట్‌వర్క్

బరితెగించారు

కోర్టు ఆదేశాలను ధిక్కరించి పచ్చనేతలు బరితెగించారు. బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. సోమవారం పందేలను యథేచ్ఛగా నిర్వంచారు. పందేలను తిలకించేందుకు వచ్చే వారికి సకల సౌకర్యాలు ఏర్పాటుచేశారు. కోడి పందేలతోపాటు జూదం, గుండాట, పేకాట నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పచ్చ నేతలు మాత్రం రెండు చేతులా సంపాదించుకుంటున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడం మినహా కనీసం బరుల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అక్కడక్కడ అరెస్టులు చూపి ఫోజులిస్తున్నారు.

- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఇలాఖాలో ఐదు బరులు
- మంత్రి అనగాని సత్యప్రసాద్ అడ్డాలో ఒకే పెద్ద బరి
- మంతెనవారిపాలెంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ అనుచరుల భారీ బరి
- కొన్ని బరుల్లో ఆటకు రూ.6 లక్షలు
- మరి కొన్నింటిలో రూ.4 లక్షలు
- మంతెనవారిపాలెంలో వరుసగా మూడు పందాలు గెలిస్తే బుల్లెట్
- కొల్లూరులో తొమ్మిదింటిలో ఐదు ఆటలు గెలిస్తే బుల్లెట్
- కోట్లలో పందాలు.. అంతకు మించి పైపందాలు
- కోడి పందాలతోపాటు అన్నిరకాల జూదాలు నిర్వహణ

పచ్చ నేతల ఆధ్వర్యంలో జిల్లాలో జోరుగా కోడిపందేలు



సాక్షిప్రతినిధి,బాపట్ల/రేపల్లెరూరల్: పచ్చ నేతల ఆధ్వర్యంలో జిల్లాలో భోగి పండుగ రోజే కోడిపందేలు జోరందుకున్నాయి. ఇక సంక్రాంతి, కనుమ రోజుల్లో పతాక స్థాయికి చేరనున్నాయి. బరుల్లో కోడిపందేలే కాక పేకాట, ఇతర పలురకాల జూద క్రీడలు నిర్వహిస్తున్నారు. ఈ ఆటల నిర్వహణను హైదరాబాద్‌కు చెందిన వారికి రూ.33 లక్షలకు కాంట్రాక్ట్ ఇచ్చినట్లు సమాచారం. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో కోడిపందేలు, పేకాట ప్రతి ఏటా పెద్ద ఎత్తున నిర్వహించడం పరిపాటిగా మారింది.

- మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం వద్ద 30 ఎకరా ల్లో ఆరు బరులు ఏర్పాటు చేయగా సోమవా రం ఉదయం నుంచి కోడి పందేలు మొదలు పెట్టారు. రూ.20 వేల నుంచి రూ.6 లక్షల వరకు పందేలు నడిచాయి. వరుసగా ఐదు పందేలు గెలిచిన వారికి టూ వీలర్‌ను నిర్వాహకు లు ప్రోత్సాహక బహుమతిగా పెట్టారు. బహు మతి గెలిచిన వారి నుంచి నిర్వాహకులు 15 నుంచి 20 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు.
- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న వేమూరు నియోజకవర్గంలో కొల్లూరు శివారులోని బోస్‌నగర్, అనంతవరం, వేమూరు మండలం జంపని, చుండూరు మండలం కేఎస్ పల్లి, భట్టిప్రోలు మండలం పల్లెకోన ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేశారు. రూ.20 వేల నుంచి రూ.4 లక్షల వరకూ తొలిరోజు పందాలు నడిచాయి. తొమ్మిది పందాల్లో ఐదు గెలిచిన జట్టుకు నిర్వాహకులు బుల్లెట్ బండిని ప్రోత్సాహక ఆఫర్ పెట్టారు. రాబోవు రెండు రోజుల్లో పందేలు మొత్తంతోపాటు పై పందేలు రూ. కోట్లలో పెరగనున్నాయి.

మంతెనవారిపాలెంలో తొలిసారి బరి

రాజుల అడ్డా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో తొలిసారి బరి ఏర్పాటు చేసి కోడిపందేలతోపాటు పలు రకాల జూదక్రీడలకు తెరతీశారు. గతంలో కొందరు రాజులు సంక్రాంతికి కోడిపందేలు ఆడేందుకు భీమవరం వెళ్లేవారట. ఇప్పుడు బాపట్ల నుంచి రాజుల సామాజికవర్గానికి చెందిన నరేంద్రవర్మ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో రాజులు ఈసారి ఏకంగా మంతెనవారిపాలెంలో 40 ఎకరాల విస్తీర్ణంలో జిల్లాలోనే అతిపెద్ద బరిని ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి కోడిపందేలు మొదలు పెట్టారు. ఇక్కడ వరుసగా మూడు పందాలు గెలిచిన వారికి బుల్లెట్ బహుమతిగా పెట్టారు. పందెం రూ.50 వేలనుంచి రూ.6 లక్షలు పెట్టారు. బహుమతిలో ఇక్కడ నిర్వాహకులు 20శాతం కమీషన్ వసూలు చేస్తున్నట్లు సమాచారం.



మంతెనవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పచ్చనేతల బరి

రూ. 10 లక్షలకు తగ్గకుండా పై పందాలు

కోడిపందేల వద్ద తొలిరోజు కోట్లలో చేతులు మారగా అంతకు మించి పైపందాలు నడిచినట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఆటగాళ్లు రూ.10 వేల నుంచి రూ.3 లక్షల వరకూ పందాలు కాయగా ఆట చూసేందుకు వచ్చినవారు రూ. వెయ్యి నుంచి రూ.10 లక్షల వరకూ పై పందాలు కాచినట్లు తెలుస్తోంది. ఆటగాళ్లకు నిర్వాహకులే విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

పట్టించుకోని పోలీసులు

పచ్చపార్టీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా కోడిపందేలతోపాటు బరులవద్ద పెద్ద ఎత్తున పలురకాల జూద క్రీడలను నిర్వహిస్తున్నా పోలీసులు అటువైపు తొంగిచూడలేదు. కోడి పందేలు నిర్వహిస్తే కేసులు పెడతామని పోలీసులు తొలుత హడావుడి చేశారు. వారం రోజులనుంచి పచ్చపార్టీ కార్యకర్తలు బరులకు ఏర్పాటు చేస్తున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. వేమూరు మండలం జంపనిలో అధికారపార్టీ బరిని ఏర్పాటు చేయగా బరిని నిలిపివేశామని ఇక్కడి పోలీసులు ఆర్భాటంగా ప్రకటించారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో ఎమ్మెల్యే అనుచరులు జిల్లాలోనే పెద్ద బరిని ఏర్పాటు చేయగా బరిని నిర్వహిస్తే కేసులు పెడతామని, ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని ఇక్కడి డీఎస్పీతోపాటు పోలీసులు ఆర్భాటంగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. తీరా చూస్తే సోమవారం నుంచి ఇక్కడ జిల్లాలోనే పెద్ద ఎత్తున కోడిపందేలు ఇతర జూదక్రీడలు నిర్వహిస్తున్నారు. ఆటగాళ్లకు భోజనాలు కూడా ఏర్పాటు చేయడంతో జిల్లాతో పాటు చుట్టుప్రక్కల జిల్లాల జూదరులు ఇక్కడికే తరలివస్తున్నారు. ఇంతరుగుతున్నా పోలీసులు కన్నెత్తి చూడడంలేదు.


ఏరులై పారుతున్న మద్యం

బరుల వద్ద మద్యం ఏరులై పారుతోంది. బ్రాందీ షాపుల యజమానులు ఇక్కడికే మద్యం సరఫరా చేస్తున్నారు. ఒక్కో బరి వద్ద పదుల సంఖ్యలో బెల్టుషాపులు వెలిశాయి. మద్యం తాగి జనం ఆటగాళ్ల తోపాటు చూసేందుకు వచ్చినవారు గొడవలు పడుతున్నారు. పోలీసులు లేకపోవడంతో ఘర్షణలు అదుపుతప్పి శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదముంది.



పార్కింగ్ దోపిడీ

అన్ని ప్రాంతాల్లోని బరుల వద్ద పార్కింగ్ పేరుతో నిర్వాహకులు సందర్శకుల నుంచి భారీగా వసూలు చేస్తూ పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారు. పార్కింగ్ వద్ద టూవీలర్‌కు రూ.100 నుంచి 150, ఫోర్ వీలర్‌కు రూ.200 నుంచి 250 వసూలు చేస్తున్నారు.





పాతమల్లాయపాలెంలో...



రేపల్లె తూర్పుపాలెం వద్ద టీడీపీ నాయకుల హడావిడి,



జూద క్రీడ

వైభవంగా శివ ముక్కోటి పర్వదినం



దర్శనం కోసం నిలబడిన భక్తులు

మంగళగిరి(తాడేపల్లి రూరల్): మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ మాట్లాడుతూ స్వామి తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారంలో భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉత్సవానికి బచ్చు వెంకట ఉల్లక్కి, మాణిక్యమ్మ జ్ఞాపకార్థం మాజేటి లక్ష్మీ నరసింహమూర్తి, లలిత దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారని, అనంతరం గ్రామోత్సం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు టి. మహేష్‌కుమార్‌శర్మ, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, డాక్టర్ వంశీకృష్ణ మాజేటి, దీప దంపతులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, అధికారులు

బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరు సుఃఖసంతోషాలతో ఉండాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో మెలగాలని, పాడిపంటలు, అష్ట ఐశ్వర్యాలతో తలతూగలని కోరారు. సంక్రాంతి పండుగ సంబరాలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రెండు బైక్‌లు ఢీ-విద్యార్థి మృతి


మృతి చెందిన మనోహర్ జోష్

వేటపాలెం: ఎదురెదురుగా వేగంగా రెండు మోటార్ బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని కఠారివారిపాలెం రోడ్డులో సోమవారం సాయింత్రం జరిగింది. ఎస్సై ఎం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. చినగంజాం మండలం మోటుపల్లి వద్ద సీరిక్ష ఐగిరికి చెందిన పొన్నపూడి మనోహర్ జోష్ (15), తన పెద్దమ్మ గ్రామమైన కఠారివారిపాలేనికి సంక్రాంతి పండుగకు వచ్చాడు. పెద్దమ్మ కొడుకు కొండూరి గోపయ్య ఇద్దరూ కలసి బైక్‌పై వేటపాలెం వచ్చారు. వేటపాలెంలో పని పూర్తిచేసుకొని తిరిగి కఠారివారిపాలెం వెళ్తున్నారు. అదే సమయంలో కఠారివారిపాలెం నుంచి వేటపాలెం వస్తున్న బైక్‌తో ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చొన్న మనోహర్ జోష్‌కి తీవ్ర గాయాలు కాగా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మనోహర్‌జోష్ మృతి చెందాడు. కొండూరి గోపయ్య ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు

- ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి టీ-20 క్రికెట్ పోటీలు
- టోర్నీలో కొనసాగుతున్న చెన్నై జట్ల హవా


తలపడుతున్న చెన్నై జట్లు

మేదరమెట్ల: రాష్ట్రస్థాయి టీ-20 క్రికెట్ పోటీల్లో చెన్నైకు చెందిన జట్లు సెమీస్‌కు చేరకున్నాయి. రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతలలో భ్రమర సంక్రాంతి కప్-2025 నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లలో చెన్నైకు చెందిన రెండు జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

17 పరుగుల తేడాతో ఎస్‌అండ్‌ఆర్‌సీ విజయం

ఉదయం జరిగిన మ్యాచ్ ఇండియన్ బ్యాంక్ ఎస్ అండ్‌ఆర్‌సీ చెన్నై వేలూర్ ఎస్ సౌత్‌జోన్ సీసీ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎస్‌అండ్‌ఆర్‌సీ జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దీంతో బ్యాటింగ్ ఆరంభించిన వేలూర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఈ జట్టులో జితేంద్రకుమార్ 22 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38, విజయకుమార్ 29 బంతుల్లో 3 ఫోర్లతో 32 పరుగులు చేశారు. ఇండియన్ బ్యాంక్ చెన్నై జట్టు బౌలర్ అల్లెండర్ 4 ఓవర్లు వేసి 32 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. 164 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన ఇండియన్ బ్యాంక్ ఎస్‌అండ్‌ఆర్‌సీ చెన్నై జట్టు 19.3 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 17 పరుగుల తేడాతో వేలూర్ చెన్నై జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది.

112 పరుగుల తేడాతో ఎస్‌కేఎం సీసీ విజయం

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఎస్‌కేఎం సీసీ (చెన్నై)-జీఎస్‌టీ సీఈ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎస్‌కేఎం సీసీ లెవెన్ చెన్నై జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 19.4 ఓవర్లలో 175 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఈ జట్టులో రాజలింగం కేవలం 16 బంతుల్లో 6 సిక్స్‌లతో 43 పరుగులు, హేమచరణ్ 22 బంతుల్లో ఒక ఫోరు, 2 సిక్స్‌లతో 36 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు దోహదపడ్డారు. జీఎస్‌టీ బౌలర్ హరీష్ 4 ఓవర్లు బౌల్ చేసి 28 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం 176 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన జీఎస్‌టీ జట్టు పేలవమైన ప్రదర్శన చేస్తూ 11.5 ఓవర్లలో కేవలం 63 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. ఈ జట్టులో హరీష్ ఒక్కడే రెండు అంకెల స్కోర్ చేయగా మిగిలి బ్యాట్స్‌మెన్ ఎవ్వరూ స్కోర్ చేయలేక పోయారు. ఎస్‌కేఎం సీసీ జట్టులో జద్దు గణేష్ 3 వికెట్లు, సూర్య 3 వికెట్లు తీశారు. దీంతో 112 పరుగుల భారీ తేడాతో ఎస్‌కేఎం సీసీ జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లకు అంపైర్లుగా శ్రీనివాస్, రాజు, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జీడీసీసీఏ లెవెన్ (గుంటూరు)-వేలూర్ ఎస్ సౌత్‌జోన్ సీసీ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య, మధ్యాహ్నం రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై)-ఎస్‌కేఎం సీసీ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య పోటీలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల సమావేశం


యాజలి పాఠశాలలో ఒకే వేదికపై ఉన్న 1966-2023 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు

కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1966 నుంచి 2023 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు శని, ఆదివారాలలో అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత 1961లో ప్రారంభించారు. తొలుత 1966 వరకు చదుకునే విద్యార్థులు ఉన్నత చదువులకు బయటకు వెళ్లారు. 1966 నుంచి 2023 వరకు గల పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల ఏర్పడి 63 సంవత్సరాలు అయిన సందర్భంగా మెగా ఆత్మీయ సమ్మేళనం రెండు రోజులపాటు వేడుకగా నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పెనుమత్స నాగరాజు (చినబాబు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తరువాత ఒకేచోట చేరటంతో స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకుని కుశల ప్రశ్నలతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పుడు చదువుకున్న పాఠశాల తరగతి గదుల వెంట తిరిగి చూసి తాము చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుని నవ్వుకున్నారు. తమ గురువులకు శాలువాలు కప్పి మెమెంటోలు అందజేసి పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. పాఠశాలలో టాపర్‌లుగా నిలిచిన పూర్వ విద్యార్థులను, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను, ఉద్యోగ వ్యాపారాలలో ఉన్నత స్థాయిలో ఉన్న వారిని సన్మానించారు. ప్రస్తుత ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇంటిలిజెన్స్ డీఎస్పీ యంపరాల శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ దుండి ఏడుకొండలరెడ్డి, ఏఎస్ఐ డేవిడ్, వీఎస్‌ఆర్ ఎస్టేట్స్ అధినేత జి.బ్రహ్మయ్య, పాస్టర్ లాబానురాజు, గుండ్రెడ్డి సత్యనారాయణ, ఇక్కుర్తి లక్ష్మీనరసింహ, లక్కాపుల వెంకటరావు, శివశంకర్, ఎల్ఐసీ శ్రీనివాసరావు, మందపాటి పరమానందకుమార్ పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని ఆశయాలతోనే శాంతి సాధ్యం

శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహిన్


భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద బౌద్ధుని సూక్తులను వివరిస్తున్న శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహిన్

భట్టిప్రోలు (కొల్లూరు): సమాజంలో శాంతి, సౌఖ్యాలు విరజిల్లాలంటే గౌతమ బుద్ధుని ఆశయాలు, సూక్తులు తప్పినిసరిగా ఆచరించాలని శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహీన్ అన్నారు. సోమవారం భట్టిప్రోలు బౌద్ధ ఆరామాన్ని సందర్శించిన ఆయన పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. తొలుత బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం సుదర్శి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో బోధిహిన్ మాట్లాడారు. ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంఎస్ఎస్. అశోక్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బుద్ధిజాన్ని స్వీకరించారని, ఆయన తరహాలోనే ప్రతి ఒక్కరూ బుద్ధిజాన్ని అలవరుచుకుంటే శాంతికాముకులవుతారన్నారు. సభ్యాక్షులు మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏప్రాంతంలో వారైనా బుద్ధుని ఆలయం నిర్మించాలనుకుంటే తమ సంస్థ సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. బౌద్ధ స్థూపాన్ని అభివృద్ధి పరిచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరారు. కార్యక్రమంలో తుపాకుల హరిప్రసాద్, ఏవీఎస్. రాజు, ఈగ శ్రీనివాసరావు, క్రాంతి, కనుకుర్తి హరిప్రసాద్, తిరుమలశెట్టి ప్రసన్నకుమార్, బౌద్ధ ఉపవాసకులతో పాటు, బాసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణంలో సినీ హీరో అభిరామ్


పూజలు చేస్తున్న హీరో అభిరామ్

కారంచేడు: ధనుర్మాసం పురస్కరించుకొని ఆలయాల్లో నిర్వహించే గోదాదేవి కల్యాణంలో సినీ హీరో దగ్గుబాటి అభిరామ్ పాల్గొన్నారు. కారంచేడు రామాలయంలో సినీ నిర్మాత, మూవీ మొఘల్‌గా పేరొందిన మాజీ ఎంపీ దగ్గుబాటి రామానాయుడు కుటుంబ సభ్యుల ఇష్టదైవంగా భావించే రాములోరి సన్నిధిలో ఆయన మనుమడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు కుమారుడు, హీరో అభిరామ్ దంపతులు గ్రామంలో పర్యటించి భోగి పండుగను సంతోషంగా గడిపారు. ఆయన గ్రామంలోని చెరువు బజారులోని రామాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అర్చకస్వామి ఆయనతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

మధురం.. అలనాటి తీపిగుర్తులు

42 ఏళ్ల తర్వాత ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

జే.పంగులూరు: మండలంలోని ముప్పవరం గ్రామంలో గల పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాలలో 1983-88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ 42 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో వారు చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులందరూ వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. తమ ముందు ఆడుతూ, పాడుతూ కనిపించిన పిల్లలు, వారి కుటుంబలతో కలసి కార్యక్రమానికి రావడం చూసి ఉపాధ్యాయులు అమితానందం పొందారు. మా ఉపాధ్యాయులను సత్కరించుకోవడం మా పూర్తి జన్మ సుకృతం అని, వారివలనే మా జీవితాల్లో వెలుగు నిండాయని కొనియాడారు. పిల్లల ఆటపాటలతో కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారుతీ, రాజేంద్ర, వెంకారెడ్డి, శారద ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు పి ప్రసాద్, ఉపాధ్యాయులు జానకిరామయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దగ్గుబాటి ఇంట భోగి మంటలు


వేడుకల్లో పురందేశ్వరి కుటుంబసభ్యులు

కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఇంటి వద్ద సోమవారం కుటుంబ సభ్యులు భోగి మంటలు వేసుకొని వేడుకలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హితేష్ చెంచురామ్ కుటుంబసభ్యులు, కుమార్తె నివేదిత కుటుంబ సభ్యులతోపాటు సినీ హీరో, డాక్టర్ రామానాయుడు మనుమడు దగ్గుబాటి అభిరామ్, డాక్టర్ చంద్రమౌళి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఉదయం దగ్గుబాటి కుటీరంలో భోగి మంటలు వేసి సంతోషంగా గడిపారు.

17,18 తేదీల్లో ఉచిత ప్లాస్టిక్ సర్జరీల పరీక్ష శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: సికింద్రాబాద్ ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్ లోని లయన్స్ క్లబ్ ఆసుపత్రిలో ఈనెల 17, 18 తేదీల్లో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీల పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రామ్ కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి. రామిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్ ప్రతినిధి విద్యాభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మొర్రి , గ్రహణం అంగుళీకం, కాలిన గాయాలు, చేతులకు వేళ్లు, గొంతు అతుక్కొని ఉన్నవారికి ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. అంగలి చీలిక, క్రానియో ఫేషియల్, అనోమాలిస్, పుట్టుకతో వచ్చే చేతి వైకల్యాలు, ప్రసూతి బ్రాచిలర్ ప్లేసెస్, గాయం పోస్ట్, బర్న్ పోస్ట్, ట్రామా వైకల్యాలు, వాస్క్యులర్ అనోమాలిస్ 12, 14 ఏళ్ల వయసు గల పిల్లలను ప్రభావితం చేసే ఇతర వైకల్యాల గురించి ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 18వ తేదీలోపు స్క్రీనింగ్ పరీక్షలకు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని వారు సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 20వ తేదీ నుంచి పది రోజులపాటు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు భవానీ ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9908630301, 9848241640 లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


బాపట్లలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఐ నాయకులు


భట్టిప్రోలులో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

- ప్రజలపై భారాన్ని మోపటం మానుకోవాలి
- సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్

బాపట్ల పెంచిన విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడలిలో సోమవారం పెంచిన విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలను నిరసిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా వివిధ రకాల విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ట్రూ ఆఫ్ చార్జీలను 2022, 23, 24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైనది కాదన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న చెప్పిన చంద్రబాబు ఇచ్చిన మాటను మరిచారన్నారు. ప్రజలు నమ్మి ఓటు వేసినందుకు ప్రజలపై ఇలా భారం మోపటం సరైనది కాదన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై భారాలు మోపడం తగదని వెంటనే ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడిబత్తుల అశోక్ తదితరులున్నారు.

భట్టిప్రోలు(కొల్లూరు): కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం పెంచుతూ పెంచిన విద్యుత్ బిల్లులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యాన భట్టిప్రోలు, పెదపులివర్రు గ్రామాలలో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి పట్టుదలతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించని పక్షంలో ప్రజాపోరాటానికి సంసిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. సీపీఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, పి.మనోజ్‌కుమార్, నాయకులు ఏప్రాయం, నాగమల్లేశ్వరరావు, ఆరోను పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



పట్నంబజారు(గుంటూరుఈస్ట్): ఇంటిలో చోరీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్‌లో నివాసం ఉండే తోకల రవి కార్పొరేషన్ పరిధిలోని సచివాలయం నంబరు- 4లో టౌన్ ప్లానింగ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య దేవరకొండ వెంకటశివమ్మ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఇద్దరూ అత్తమామలైన దేవరకొండ వెంకటరమణ, రామతులసమ్మ ఇంటిలో ఉంటున్నారు. ఈనెల 12 రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి అందరూ నిద్రించారు. వెంకటరమణకు వాష్‌రూంకు వెళ్లే అలవాటు అధికంగా ఉండటంతో కింద పోర్షన్‌లో నివాసం ఉండే ఆయన భార్య రామతులసమ్మ తలుపులు తీసి నిద్రించారు. 13వ తేదీ ఉదయం లేచి చూసేసరికి బీరువా తలుపులు తీసి ఉండటం గమనించారు. అందులోని 379 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకు పోయారు.తోకల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. తలుపులు తీసి ఉండటం, పక్కనే రైల్వే ట్రాక్ ఆనుకొని ఉండటంతో చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. తెలిసిన వారే చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

30 గొర్రెలూ మృత్యువాత



వినుకొండ: బస్సు ఢీకొని 30 గొర్రెలు, యువకుడు మృతిచెందిన ఘటన వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వినుకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎర్రగొండపాలెం వెళ్లి తిరుగు ప్రయాణంలో అందుగులకొత్తపాలెం వద్ద అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన తిరుపతయ్య (18) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.